క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో న్యూ ఇయర్ వేడుకలు



లబ్బీపేట(విజయవాడతూర్పు): నగరంలోని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో బుధవారం నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్ పార్టీ నేతలు, కార్యకర్తలతో కలిసి కేక్ కట్ చేశారు. జిల్లాలోని ఏడు నియోజకవర్గాలకు చెందిన నాయకులు కార్యకర్తలు వేలాదిగా తరలివచ్చి అవినాష్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సంవత్సరంలో ప్రజలందరూ సుఖ సంతోషాలతో జీవించాలని, అందరికీ మంచి జరగాలని ఆకాంక్షించారు.

అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): దుర్గాపురం అయ్యప్ప స్వామి మందిరంలో నూతన సంవత్సరం స్వామవారికి ప్రీతికరమైన బుధవారం పురస్కరించుకుని శ్రీ మణికంఠ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిగాయి. ట్రస్ట్ వ్యవస్థాపకులు బల్లెం పూర్ణయ్య గురుస్వామి లోక కళ్యాణార్థం స్వామివారికి విశేషంగా కుంకుమ, పసుపు, పంచామృతాలు, గంధం, భస్మం తదితర దివ్య ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వాములు పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరిగింది.

కృపా మినిస్ట్రీస్‌లో ప్రత్యేక ప్రార్థనలు



పాయకాపురం (విజయవాడరూరల్): నూతన సంవత్సరం పురస్కరించుకొని బుధవారం ఉడా కాలనీ, కండ్రిక, ప్రకాష్‌నగర్, రాజీవ్‌నగర్ ప్రాంతాలలోని క్రైస్తవ చర్చిల్లో బుధవారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. రాజీవ్‌నగర్లోని ఉడా కాలనీ కృపా మినిస్ట్రీస్ ప్రార్థన మందిరంలో జరిగిన ప్రత్యేక ప్రార్థనలో చర్చి పాస్టర్ చల్లా దేవిడ్‌రాజు మాట్లాడారు. క్రైస్తవులు సమాజానికి మంచి చేస్తూ జీవితాన్ని ఆశీర్వదకరంగా చేసుకోవాలని సందేశమిచ్చారు. వందల సంఖ్యలో భక్తులు ప్రార్థన మందిరంలో పాల్గొని ఏసుక్రీస్తుకు స్తుతులు చెల్లించుకున్నారు. అనంతరం కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ ప్రాంతంలోని పలు క్రిస్టియన్ చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

బాబా సేవలో ఆదాయపన్ను ప్రధాన కమిషనర్ సునీత



మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు షిరిడీ సాయిబాబా మందిరంలో బాబావారిని బుధవారం సాయంత్రం ఆదాయపన్ను ప్రధాన కమిషనర్ సునీత బిశ్వా దర్శించుకుని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆంధ్రా షిరిడీగా విరాజిల్లుతున్న బాబా మందిరంను దర్శించటం ఆనందంగా ఉందన్నారు. బాబా మందిరంలో నిర్వహిస్తున్న ఆధ్యాత్మిక, సేవాకార్యక్రమాలను ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కుంచనపల్లి రవిశంకర్ వివరించారు. తొలుత ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు నిర్వహించి బాబావారి శేష వస్త్రం చిత్రపటంను సునీతకు అందజేశారు. కార్యక్రమంలో ఆలయకమిటీ కోశాధికారి మండలపర్తి సత్యశ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ



పెనమలూరు/కంకిపాడు: ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. పోరంకిలో బుధవారం ఉపాధ్యాయ సంఘం ఎస్టీయూ క్యాలెండర్, డైరీ, స్టిక్కర్లు ఆవిష్కరించి మాట్లాడారు. ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించడానికి ప్రభుత్వం సానుకూలంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు పీకా ఇమ్మానుయేలు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు యు.టైటాస్‌పాల్, నేతలు ఎ.శ్రీనివాసమూర్తి, పి.వి.కృష్ణమోహన్, జయరాజ్, అబ్దుల్‌కాలిక్, కె.పిచ్చేశ్వరరావు, ఎ.సత్యవంతు, పి.సురేష్‌బాబు, ఐ.నాగేశ్వరరావు పలువురు పాల్గొన్నారు.

వన్ వే ఉన్నా...
తప్పని ట్రాఫిక్ కష్టాలు

- సత్యనారాయణపురంలో అమలు కాని వైనం
- ఎదురెదురు వాహనాలతో నిలిచిపోతున్న ట్రాఫిక్
- పర్యవేక్షణ పట్టించుకోని పోలీసులు

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): సత్యనారాయణపురంలో ఎస్ఆర్‌పీ రోడ్డు, శివాలయంవీధి నిత్యం ట్రాఫిక్ సమస్య వెంటాడుతుంది. దీంతో వాహనదారులు, పాదచారులు ఆయా రోడ్డులో రాకపోకలు సాగించేందుకు అనేక ఇబ్బందులు ఎదుర్కుంటున్నారు. అసలే ఇరుకుగా ఉండే ఎస్ఆర్‌పీ రోడ్డు, శివాలయం వీధుల్లో అనేక వ్యాపార సముదాయాలు ఉండటంతో రోడ్డుకు రెండు వైపుల వాహనాల పార్కింగ్‌తో పాటు వచ్చే వాహనాలు, వెళ్లే వాహనాలతో ట్రాఫిక్ నిలిచిపోతుంది. దీంతో ట్రాఫిక్ పోలీసులు ఎస్ఆర్‌పీ రోడ్డు, శివాలయం వీధుల్లో వన్ వే నిబంధన అమలు చేశారు. అందుకోసం శారద కళాశాల జంక్షన్ నుంచి ఎస్ఆర్‌పీ రోడ్డులోకి వేళ్లే మార్గం, జీఎస్ రాజు రోడ్డు నుంచి శివాలయం వీధిలోకి వచ్చి రోడ్లలో బారికేట్లు ఏర్పాటు చేసి వన్ వే నిబంధన అమలుపర్చారు.



శారద జంక్షన్ నుంచి వన్ వే లోకి వెళ్తున్న వాహనదారులు

నిబంధనలు పాటించని వాహనదారులు...

ఎస్ఆర్‌పీ రోడ్డు, శివాలయంవీధులలో వన్ వే నిబంధన ఉన్నప్పటికి వాటిని పర్యవేక్షించాల్సిన ట్రాఫిక్ పోలీసులు లేకపోవడంతో వాహనదారులు నిబంధనలు పాటించకుండా వన్ వే గుండా వాహనాలతో రావటంతో ఎదురేదురు వాహనాలలో అక్కడ ట్రాఫిక్ సమస్య తలెత్తుతుంది. ముఖ్యంగా ఆర్టీసీ బస్సులు వచ్చిన సందర్భంలో ఎదురుగా వచ్చే వాహనాలతో సమస్య మరింత జఠిలమవుతుందని వాహనదారులు వాపోతున్నారు.



ప్రమాదకరంగా వన్ వేలోకి దూసుకొస్తున్న ద్విచక్ర వాహనదారులు

ట్రాఫిక్ పోలీసుల నిర్లక్ష్యం...

ట్రాఫిక్ పోలీసులు వన్ వే నిబంధనలు అమలు చేసి చేతులు దులుపుకోవడంతోనే ఆయా రోడ్లలో నిత్యం ట్రాఫిక్ సమస్య నెలకుంటుందని పలువురు వాహనదారులు వాపోతునానరు. రోజుల తరబడి ఇళ్ల ముందు కార్లు పార్కింగ్ చేయడం, దుకాణాల ఎదుట పార్కింగ్ చేయడంతో ట్రాఫిక్ సమస్య ఎక్కువగా నెలకుంటుందని స్థానికులు వాపోతున్నారు. వన్ వే నిబంధన అమలు చేస్తున్న ట్రాఫిక్ పోలీసులు పర్యవేక్షణ కూడ చేపట్టి ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఇరుకు రోడ్డులోనే కార్లు పార్కింగ్...

అసలే ఇరుకుగా ఉండే శివాలయంవీధిలో కొంత మంది తమ నివాసాల ముందే కార్లను పార్కింగ్ చేస్తుండటంతో నిత్యం ఇక్కడ ట్రాఫిక్ నెలకుంటుంది. వన్ వే నిబంధన ఉన్నప్పటికి వాటి యజమానులు రాంగ్ రూట్‌లోనే యథేచ్ఛగా పార్కింగ్ చేస్తున్నారు. దీంతో ఆ రోడ్డులో వాహనాల రాకపోకలకు తీవ్ర ఆటంకం ఏర్పాడుతుందని స్థానికులు ఆరోపిస్తున్నారు.



శివాలయంవీధిలో రోజుల తరబడి ఇళ్ల ముందు పార్కింగ్ చేస్తున్న కార్లు

కుంగిన టిప్పర్... తప్పిన ముప్పు



మధురానగర్(విజయవాడసెంట్రల్): నూతన సంవత్సరంలో పెద్ద ముప్పు తప్పింది. నిత్యం రద్దీగా ఉండే శ్రీనగనర్ కాలనీ డ్రైనేజీ పంపింగ్ స్టేషన్ సమీపంలో బుధవారం టిప్పర్ కుంపోయింది. అదృష్టవశాత్తూ ఆసమయంలో అక్కడ ఎవరూ లేకపోవటంతో పెద్ద ముప్పు తప్పిందని స్థానికులు అంటున్నారు. ఇటీవల శ్రీనగర్ కాలనీలో యూజీడీ పైపులైన్ పనుల కోసం రోడ్డును తవ్వి పనులు పూర్తి చేశారు. అయితే తవ్విన రోడ్డును సక్రమంగా పూర్తి చేయకుండానే తూతూమంత్రంగా రోడ్డును సరిచేసి అధికారులు చేతులు దులుపుకున్నారు. దీంతో బుధవారం లోడుతో వచ్చిన టిప్పర్ రోడ్డు నాసిరకంగా ఉండటంతో కుంగిపోయింది. దీంతో స్థానికులు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. ఎటువంటి ప్రమాదం జరగకపోవటంతో ఊపిరి పీల్చుకున్నారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

బాబా మందిరాల్లో నూతన సంవత్సర పూజలు



పసుపుతోట శ్రీదత్తసాయి మందిరంలో బాబావారు



శ్రీదత్తసాయి మందిరంలో అన్నప్రసాద వితరణ

మధురానగర్(విజయవాడసెంట్రల్): నూతన సంవత్సరం పురస్కరించుకుని బుధవారం ముత్యాలంపాడు షిరిడీ సాయిబాబా మందిరంలో ఆలయ కమిటీ ఆధ్వర్యాన ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ప్రజలందరూ నూతన సంవత్సరంలో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షిస్తూ బాబాకు మహన్యాసపూర్వక రుద్రాభిషేకం, విశేషంగా అర్చనలు చేశారు. అనంతరం బాబవారి నూతన సంవత్సరం క్యాలెండర్, తీర్థప్రసాదాలు భక్తులకు పంపిణీ చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు బాబావారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరిగింది.

మధురానగర్ పసుపుతోట శ్రీదత్తసాయి మందిరంలో ప్రత్యేక పూజలు అర్చనలు జరిగాయి. మందిర వ్యవస్థాపకులు తంగెళ్ళమూడి వీరమోహనరావు బాబాకు విశేషంగా పంచామృత అభిషేకం, అన్నాభిషేకం నిర్వహించారు. దాతల సహకారంతో అన్నప్రసాద వితరణ నిర్వహించారు. శ్రీసాయి నక్షత్రమాలిక మండలి ఆధ్వర్యాన పారాయణం జరిగింది. పెద్ద సంఖ్యలో భక్తులు బాబాను దర్శించుకుని పూజలు చేశారు. మధురానగర్ ఓంకార క్షేత్రం శ్రీ భగవాన్ షిర్డీసాయి బాబా మందిరంలో ఆలయ కమిటీ గౌరవాధ్యక్షురాలు పిల్లి లక్ష్మీతులసి, పీవీఎల్ఎస్‌రాజు దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ విష్ణు సహస్ర నామ పారాయణ మండలి ఆధ్వర్యాన శ్రీ విష్ణుసహస్రనామ పారాయణం జరిగింది. పెద్ద సంఖ్యలో మహిళలు పారాయణంలో పాల్గొని పూజలు చేశారు.



ఓంకార క్షేత్రంలో ధనుర్మాస పూజలు



ముత్యాలంపాడు శ్రీషిర్డీసాయి బాబా మందిరంలో...

ఈశ్వర్ సేవలు అభినందనీయం

పటమట(విజయవాడతూర్పు): ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ ఎంప్లాయిస్ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ దొప్పలపూడి ఈశ్వర్ స్వచ్ఛంద పదవీ విరమణ కార్యక్రమం జరిగింది. విజయవాడ నగర పాలక సంస్థ కార్యాలయంలో బుధవారం అభినందన సన్మాన సభ నిర్వహించారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి అంకితభావంతో పనిచేసి, విజయవాడ నగరపాలక సంస్థ ఉద్యోగులకు ఉద్యోగులకు 010 పద్దు కింద చేర్చడానికి ఈశ్వర్ ఎనలేని కృషి చేశారని పలువురు వక్తలు తెలిపారు. మూడు దశాబ్దాలకు పైగా వీఎంసీలో వివిధ హోదాల్లో పనిచేసి అధికారుల నుంచి, ప్రభుత్వాల నుంచి మెప్పు పొందారని పేర్కొన్నారు. వీఎంసీ ఎంప్లాయిస్ కో ఆపరేటివ్ బ్యాంకునకు మూడు పర్యాయాలు ప్రెసిడెంట్‌గా, ఇప్పటికీ డైరెక్టర్‌గా సేవలందిస్తున్నారని చెప్పారు. ఈశ్వర్ హయాంలోనే సభ్య ఉద్యోగులకు మట్టి ఖర్చులు, ఇన్సూరెన్స్ సదుపాయం కల్పించారన్నారు. విజయవాడ నగర పాలక సంస్థ మినిస్టీరియల్ ఎంప్లాయిస్ అసోసియేషన్‌కి 4 పర్యాయాలు ప్రెసిడెంట్‌గా, నాలుగు సార్లు జనరల్ సెక్రటరీగా, ఆంధ్రప్రదేశ్ మునిసిపల్ మినిస్టీరియల్ అసోసియేషన్‌కు జనరల్ సెక్రటరీగా పనిచేసి ఉద్యోగుల సమస్యలను పరిష్కారానికి కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ జేఏసీ చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వరరావు, వీఎంసీ అడిషనల్ కమిషనర్ (ప్రాజెక్ట్స్) డాక్టర్ డి. చంద్రశేఖర్, ఆంధ్రప్రదేశ్ మునిసిపల్ ఎంప్లాయిస్ సర్వీసెస్ అసోసియేషన్ విజయవాడ యూనిట్ అధ్యక్షుడు తిమ్మసర్తి నాగేశ్వర రావు, ప్రధాన కార్యదర్శి సలీం అహ్మద్, ఏపీ జేఏసీ అమరావతి సెక్రటరీ జనరల్ పలిశెట్టి దామోదరరావు, అమరావతి అసోసియేట్ చైర్మన్ ఫణి పేర్రాజు, మునిసిపల్ ఎంప్లాయిస్ సర్వీసెస్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ అక్కరబోయిన అప్పలరాజు ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర మహిళా విభాగం చైర్‌పర్సన్ పి. లక్ష్మి కె.శివరామప్రసాద్, ట్రెజరర్, రవి, వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస రావు, విజయలక్ష్మి, సంగీతరావు, టి. నాగరాజు, శ్రీకాకుళం, విశ్వనాథరెడ్డి, గాలి సుధాకర్, తిరుపతి, మోహన్ గోపాల్, అమర్నాద్ రెడి, వెంకట కృష్ణ, కే. కళ్యాణ చక్రవర్తి, ఎం. అప్పలరాజు, జాన్ పాల్ కాకినాడ, విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్ అధికారులు, ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



ఈశ్వర్ దంపతులను అభినందిస్తున్న వీఎంసీ అధికారులు, ఏపీ జేఏసీ ప్రతినిధులు

నేడు డయల్ యువర్ ఎస్ఈ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఈ నెల 2వ తేదీ ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు డయల్ యువర్ ఎస్ఈ కార్యక్రమం జరుగుతుందని ఏపీసీపీడీసీఎల్ ఎన్టీఆర్ సర్కిల్ పర్యవేక్షక ఇంజినీర్ ఎ. మురళీమోహన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్టీఆర్ సర్కిల్ పరిధిలోని విద్యుత్ వినియోగదారులు విద్యుత్‌కు సంబంధించి ఏమైనా సమస్యలు ఉంటే ఫోన్‌లో సంప్రదించాలని కోరారు. వినియోగదారులు 0866-2575620 నంబర్‌కు ఫోన్ చేయాలని కోరారు.

నేడు పుస్తకమహోత్సవంలో కార్యక్రమాలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): సాయంత్రం 6 గంటలకు సాహిత్యవేదికపై పుస్తకమహోత్సవ ప్రారంభసభ ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ముఖ్యఅతిథిగా పాల్గొంటారు. దివంగత ప్రధాని పీవీ నరసింహారావు సాహితీ జీవితంపై పుస్తకాన్ని ఆయన ఆవిష్కరిస్తారు. రాష్ట్ర ఆర్థిక, ప్రణాళికాశాఖా మంత్రి పయ్యావుల కేశవ్ మొదటి ప్రతిని స్వీకరిస్తారు. ఈ సభలో సాహిత్య అకాడమీ కార్యదర్శి కె.శ్రీనివాసరావు, పుస్తక రచయిత కృష్ణారావు పాల్గొంటారు. పిడికిటి రామకోటేశ్వరరావు సంస్మరణ సభ ఉంటుంది. దీనికి పుస్తకమహోత్సవ సంఘం గౌరవాధ్యక్షులు బెల్లపు బాబ్జీ అధ్యక్షత వహిస్తారు. తానా పూర్వ అధ్యక్షులు కోమటి జయరాం, పుస్తకమహోత్సవ సంఘం పూర్వ అధ్యక్షులు అశోక్ కుమార్ సభలో వక్తలుగా పాల్గొంటారు.

చేతివృత్తిదారులకు శిక్షణ

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగర పాలక సంస్థ పరిధిలోని ఆయా ప్రాంతాల్లో వివిధ రకాల సేవలు అందించేందుకు ప్లంబరుల, కార్పెంటర్లు, ఎలక్ట్రీషియన్లు, గృహోపకరణాల రిపేర్లు, పెయింటర్లు, బ్యూటీషియన్లు(స్త్రీ-పురుష) వంటి చేతి వృత్తులు చేసే వారిని గుర్తించేందుకు వారికి మరింత నైపుణ్యం, శిక్షణ అందిస్తామని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర తెలిపారు. వీఎంసీ ఆధ్వర్యంలో ఆయా రంగాల్లో ఉన్నవారికి హోం ట్రయాంగిల్ సంస్థ సౌజన్యంతో శిక్షణ అందించి వారికి జీవనోపాధిని కల్పించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ శిక్షణ కోసం అభ్యర్థులు ఈ నెల 3, 4 తేదీల్లో గవర్నర్‌పేటలోని వీఎంసీ ఐవీ ప్యాలెస్‌లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ నిర్వహిస్తున్నామని చెప్పారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు రిజిస్ట్రేషన్ కోసం ఆధార్‌కార్డు, పాన్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, సాధారణ/సాంకేతిక విద్యార్థల ధ్రువీకరణ పత్రాలు జిరాక్సు, భార్యపేరు, సంఘం పేరు, కోడ్, అనుభవ పత్రం, బ్యాంకు పాసుబుక్ జిరాక్సు, రేషన్‌కార్డు జిరాక్సు పత్రాలతో రిజిస్ట్రేషన్‌కు హాజరవ్వాలని తెలిపారు. వివరాలకు 8790233881, 7780683789 నంబర్లలో సంప్రదించాలని కమిషనర్ సూచించారు.

నిరుపేద చిన్నారులకు స్వెట్టర్లు పంపిణీ



మధురానగర్(విజయవాడసెంట్రల్): బీఆర్టీఎస్ రోడ్డు హెల్పింగ్ టుగెదర్ 2009 గ్రూప్ చారిటబుల్ ట్రస్ట్ కార్యాలయంలో బుధవారం సాయంత్రం నిరుపేద చిన్నారులకు స్వెట్టర్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ సభ్యులు ఎస్కే షఫీవుల్లా, కోరంగి నామల్లేశ్వరి మాట్లాడుతూ చలి పెరుగుతున్న దృష్ట్యా నిరుపేద చిన్నారులకు సామాజిక బాధ్యతగా ట్రస్ట్ సభ్యులు, దాతల సహకారంతో స్వెట్టర్‌లు అందజేస్తున్నామన్నారు. తాము చేస్తున్న సేవా కార్యక్రమాలకు సహకరిస్తున్న ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ మాజీ డెప్యూటీ గవర్నర్ డాక్టర్ బ్రహ్మదేశం వసంతకుమార్, జీవీ మురళీకృష్ణ, హేమంతరావు, రహీమా, ఆఫ్రిన్ తదితరులు పాల్గొని మాట్లాడారు.

వయో వృద్ధులు నేటి తరానికి స్ఫూర్తిదాయకం

స్వచ్ఛాంధ్ర మిషన్ మాజీ చైర్మన్ సీఎల్ వెంకట్రావు



నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరించిన వెంకట్రావు, ఇతర సభ్యులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): వయో వృద్ధులు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని స్వచ్ఛాంధ్ర మిషన్ మాజీ చైర్మన్ సీఎల్ వెంకట్రావు అన్నారు. బందరు లాకుల సమీపంలోని స్వాతంత్ర్య సమర యోధుల భవనంలో ఎన్టీఆర్ జిల్లా వరిష్ఠ పౌరుల సంక్షేమ సంఘం సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ జరిగింది. కేక్ కట్ చేసి సీనియర్ సిటిజన్స్ నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వెంకట్రావు మాట్లాడుతూ సమాజంలో వృద్ధుల సంఖ్య పెరుగుతోందన్నారు. ఇలాంటి సంఘాలు అన్ని గ్రామాల్లో విస్తరించాలని కోరారు. వృద్ధులకు ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఇటీవల నిర్వహించిన సంఘం రజోత్సవ వేడుకలపై సమీక్షించారు. వేడుకల నిర్వహణకు సహకరించిన వారికి జ్ఞాపికలు అందజేశారు. మానవతా సంస్థ అధ్యక్షుడు చెరుకూరి బాబు, సంఘ అధ్యక్షుడు వేమూరు బాబురావు, కార్యదర్శి మోతుకూరి వెంకటేశ్వరరావు, సహాయ కార్యదర్శి డి.సాంబశివరావు సామాజిక కార్యకర్తలు నార్ల వెంకటేశ్వరరావు, మాలతి, అసోసియేషన్ ప్రతినిధులు కడియాల శాంతి , నేమాని కామేశ్వరి, నాదెళ్ల సుమతీ దేవీ, అరుణాచలం, భూపతి రాజు సత్య నారాయణ రాజు తదితరులు పాల్గొన్నారు.

క్రీస్తు ఆశీస్సులు ప్రతి ఒక్కరికీ అందాలి



ప్రార్థనలు చేస్తున్న రెవరెండ్ డాక్టర్ కనమాల వరప్రసాద్



ప్రార్థన చేస్తున్న రెవరెండ్ డాక్టర్ డానియేల్

మధురానగర్(విజయవాడసెంట్రల్): లోక రక్షకుడు ఏసుక్రీస్తు ఆశీస్సులు ప్రతి ఒక్కరికీ అందాలని ప్రజలు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని రెవరెండ్ డాక్టర్ కనమాల వరప్రసాద్ అన్నారు. అంబేద్కర్ కాలనీ షీయోను ప్రార్థన మందిరంలో బుధవారం నూతన సంవత్సరం పురస్కరించుకుని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఏసుక్రీస్తు సందేశం వివరించారు. నూతన సంవత్సరంలో ప్రతి ఒక్కరూ తమకు తోచినంతలో మంచి సేవాకార్యక్రమాలు చేయాలని సూచించారు. అనంతరం ప్రేమవిందు జరిగింది. రామకృష్ణాపురం పుల్‌గాస్పల్ చర్చిలో నూతన సంవత్సరం పురస్కరించుకుని ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. ఈ సందర్భంగా రెవరెండ్ డాక్టర్ డానియేల్ లోక రక్షణ కోసం ప్రార్థనలు చేశారు. ప్రభువైన ఏసుక్రీస్తు చూపిన మార్గంలో పయనించాలని సూచించారు. చిన్నారులు విశ్వాసకులు ఏసుగీతాలు ఆలపించారు. మధురానగర్ కొబ్బరితోట జేపీఎఫ్ చర్చిలో నూతన సంవత్సరం పురస్కరించుకుని క్రీస్తు ఆరాధన జరిగింది. రెవరెండ్ డాక్టర్ బందెల దయానందం నూతన సంవత్సరంలో ప్రజలంతా సుఖసంతోషాలతో వర్ధిల్లాలంటూ ప్రార్థనలు చేశారు. పెద్ద సంఖ్యలో విశ్వాసకులు పాల్గొన్నారు. నిరుపేదలకు నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బి.విజయరాణి తదితరులు పాల్గొన్నారు.

వీధి విక్రయదారుల కమిటీ సభ్యుల ఎంపికకు దరఖాస్తులు ఆహ్వానం

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరంలోని వివిధ ప్రాంతాల్లో వీధి విక్రయాలు చేసే వ్యాపారుల అభివృద్ధికి మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్‌మెంట్ (యూబీఎస్)ల సిఫార్సు మేరకు కమిటీని ఏర్పాటు చేసేందుకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర తెలిపారు. ఈ కమిటీలో 7 మంది సభ్యులు ఉంటారని, అందులో వివిధ రకాల వీధి విక్రయాలు చేసేవారు, ఒక ఎన్జీవో (నాన్ గవర్నమెంట్ ఆర్గనైజేషన్) ప్రతినిధి, ఒక సీబీవో (కమ్యూనిటీ బెస్ట్ ఆర్గనైజేషన్) ఒకరు ఎంపిక చేస్తున్నామని తెలిపారు. ఈ కమిటీకి ఆసక్తి కలిగిన వీధి విక్రయదారులు, ఎన్జీవోల నుంచి, సీబీవోల నుంచి దరఖాస్తులను 30 రోజుల లోపు వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని పట్టణ సాధికార విభాగంలో అందించాలని తెలిపారు. ఎక్కువ దరఖాస్తులు వస్తే లాటరీ ద్వారా కమిటీ సభ్యులను ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. అభ్యర్థులు తమ దరఖాస్తుతోపాటు ఆధారుకార్డు కాపీ, వీధి విక్రయదారుల గుర్తింపు కార్డు కాపీ, వీధి విక్రయదారుల సర్టిఫికెట జతపరచాలని సూచించారు. వివరాలకు 7901610071 నంబర్లో సంప్రదించాలని సూచించారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలోని ధర్మపథం వేదికపై విజయవాడకు చెందిన శ్రీనటరాజ నృత్యాలయానికి చెందిన చిన్నారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్య ప్రదర్శన భక్తులకు ఆకట్టుకుంది. బుధవారం అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని కళావేదికపై రాయన శ్రీనివాసరావు పర్యవేక్షణలో సుమారు 30మంది శిష్య బృందం పలు కీర్తనలకు నృత్య ప్రదర్శన ఇచ్చింది. నటరాజ నృత్యాలయం నుంచి ఇప్పటివరకు సుమారు 250 మందికి పైగా చిన్నారులు అమ్మవారి సన్నిధిలో నృత్య ప్రదర్శనలు ఇచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు. నృత్య ప్రదర్శన అనంతరం శిష్యబృందానికి అమ్మవారి దర్శనం కల్పించడంతోపాటు వారికి ఆలయ డీఈవో రత్నరాజు అమ్మవారి ప్రసాదాలు అందించారు.

నూతన సంవత్సరానికి రంగవల్లులతో స్వాగతం







నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ తీర్చిదిద్దిన రంగవల్లులు

నూతన సంవత్సరానికి మహిళలు, చిన్నారులు రంగవల్లులతో స్వాగతం పలికారు. మధురానగర్, ముత్యాలంపాడు, మాచవరం, జీవీఆర్‌నగర్, దావు బుచ్చయ్యకాలనీ, వినాయకనగర్ తదితర ప్రాంతాల్లో మహిళలు, చిన్నారులు ఇంటి ముందు రంగు రంగుల ముగ్గులను అందంగా తీర్చిదిద్దారు. ఒక వైపు దోమలు కుడుతున్నా లెక్కచేయకుండా హ్యాపీ న్యూ ఇయర్ 2025 అంటూ ముగ్గులు వేశారు. అర్ధరాత్రి దాటిన తరువాత కేక్‌లు కట్ చేసి మిఠాయిలు అందజేసి పరస్పరం నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

-మధురానగర్(విజయవాడసెంట్రల్)